

భళా బాలికా.. కదిలొచ్చిన కాళికా..

పిడుగురాళ్లలోని వివేకానంద పబ్లిక్ పాఠశాలలో బుధవారం దసరా ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పండగ విశిష్టతను వివరించారు. విద్యార్థినులు దుర్గామాతల వేషధారణతో అలరించారు. మహిషాసురుడి సంహారం కళ్లకు కట్టారు.

-న్యూస్‌టుడే, పిడుగురాళ్ల

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ

గుంటూరు: రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, పీడీపీ, పీడీఐ నిర్వహణపై రెండో విడతలో అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. జిల్లాపరిషత్తు సమావేశ మందిరంలో గురువారం ఉ. 10 గంటలకు శిక్షణ ప్రారంభించనున్నారు. డీఎల్‌పీవోలు, ఎంపీడీవోలు, ఈవోఆర్‌డీలు శిక్షణకు హాజరవ్వాలని జడ్పీ సీఈవో జ్యోతిబసు ఉత్తర్వులు జారీ చేశారు.

కొత్త కోర్సు నేర్చుకో.. భవిత మార్చుకో..

నైపుణ్యం పెంపొందించుకునే వారికే ఉద్యోగావకాశాలు

ఎమర్జింగ్ టెక్నాలజీస్ మేలంటున్న నిపుణులు

ఈనాడు డిజిటల్, నరసరావుపేట, న్యూస్‌టుడే, నరసరావుపేట అర్బన్

రోజులు మారుతున్నాయి.. సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతోంది. దాన్ని అందిపుచ్చుకున్న వారికే అవకాశాలు మెండు. నిరుడు చాలా కంపెనీలు ఇంజినీరింగ్ విద్యార్థుల్ని ప్రాంగణ నియామకాల్లో ఎంపిక చేసుకోలేదు. చాలావాటిల్లో ఉద్యోగాల కోత ఉండడమే కారణం. ప్రస్తుతం ఆయా కళాశాలల్లో నైపుణ్యం ఉన్న విద్యార్థుల్ని మంచి ప్యాకేజీలతో ఎంపిక చేసుకుంటున్నాయి. చాలామంది విద్యార్థులు కేవలం అకడమిక్ పుస్తకాలు బాగా చదివి పరీక్షల్లో 80శాతానికి పైగా మార్కులు సాధిస్తే ఉద్యోగాలు వస్తాయనే భ్రమలో ఉన్నారు. అదనపు స్కిల్స్ నేర్చుకోవాలనే సలహా ఇచ్చే వారు లేక వెనకబడిపోతున్నారు.



బీటెక్ రెండో ఏడాది నుంచే సన్నద్ధత..

స్కిల్స్ నేర్చుకోవాలంటున్నారు కదా.. అని బీటెక్ చివరి ఏడాదిలో వాటిపై దృష్టి పెట్టాలనుకోవడం కూడా తప్పే అంటున్నారు నిపుణులు. బీటెక్ రెండో సంవత్సరం నుంచే ఇతర కోర్సులు, విదేశీ భాషలు నేర్చుకోవడం ప్రారంభించాలని చెబుతున్నారు. అప్పుడే చివరి ఏడాదిలో జరగబోయే క్యాంపస్ ప్లేస్‌మెంట్లకు సన్నద్ధంగా ఉండొచ్చని సలహా ఇస్తున్నారు. సీ, సీప్లస్‌ప్లస్, జావా, పైథాన్ వంటి కోర్సులకు కాలం చెల్లిందని, వీటికి ఉద్యోగాలు రావని, ప్రస్తుత సాంకేతికతను అందిపుచ్చుకునే కొత్త కోర్సులు నేర్చుకోవాలని సూచిస్తున్నారు. ఎమర్జింగ్ టెక్నాలజీస్ అని కొత్తగా వచ్చింది. ఇందులో సర్వీస్ నౌ, పెగా, ఏడబ్ల్యూఎస్, క్లౌడ్ వంటి సర్టిఫికెట్ కోర్సులు నేర్చుకోవాలి. అప్పుడే కంపెనీల క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో ఉద్యోగాలు సాధించగలుగుతారని నిపుణులు పేర్కొంటున్నారు.

☛ బీటెక్ చదువుతున్న సమయంలోనే సర్వీస్ నౌ కోర్సుపై శిక్షణ తీసుకోవాలి. స్మార్ట్ బ్రిడ్జి కంపెనీ వారు ఈ కోర్సుపై ప్రతిరోజూ సాయంత్రం ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తారు. పూర్తయ్యాక పరీక్ష ఉంటుంది. తర్వాత ఇంటర్వ్యూ చేస్తారు. ఈ రెండింటిలో విద్యార్థి నైపుణ్యం సాధిస్తే అప్పుడు సర్వీస్ నౌ కంపెనీ ఒక ధ్రువపత్రం జారీ చేస్తుంది. అది దగ్గరుంటే ప్రాంగణ నియామకాల్లో పెద్ద కంపెనీలు సైతం వెంటనే తీసుకోవడమే కాకుండా ప్యాకేజీలు కూడా బాగానే ఇస్తాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీలను అన్ని రంగాల్లో విపరీతంగా వినియోగిస్తున్నారు. వీటికి టూల్స్ వాడతారు. టూల్స్ తెలియాలంటే ఎమర్జింగ్ టెక్నాలజీ కోర్సులు నేర్చుకోవాలి. అలాగే ఆయా రంగాల్లో మార్పులు గమనిస్తుండాలి. ఆంగ్ల భాషతో పాటు ఒక విదేశీ భాష నేర్చుకోవాలి.

గ్లోబల్ సర్టిఫికేషన్‌తో సిద్ధంగా ఉండాలి



మేమే ఏదైనా కంపెనీకి వెళితే.. వారు అడిగే మొదటి ప్రశ్న..'మీ దగ్గర స్కిల్ ఉన్న ఇంజినీరింగ్ విద్యార్థులు ఎంతమంది' అని. ఇక్కడ స్కిల్ అంటే కొత్తగా ఎమర్జింగ్ టెక్నాలజీస్ కోర్సులు నేర్చుకున్నవారు ఎంత మంది అని అడుగుతున్నారు. విద్యార్థులంతా గ్లోబల్ సర్టిఫికేషన్ చేసుకుని సిద్ధంగా ఉండాలి. మేము ఫలానా కంపెనీకి వెళ్లి మా దగ్గర బీటెక్ విద్యార్థులు ఉన్నారు. వచ్చి క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ నిర్వహిస్తారా? అని అడిగితే వచ్చే పరిస్థితి లేదిప్పుడు. అలా కాకుండా మా దగ్గర ఓ వందమంది సర్వీస్ నౌ గ్లోబల్ సర్టిఫికేషన్ ఇంజినీరింగ్ విద్యార్థులున్నారని చెబితే వెంటనే కంపెనీ వాళ్లు వచ్చి ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేసుకుంటున్నాయి. ప్రాజెక్టుకు అవసరమైన నైపుణ్యం ఉందా లేదా అని గమనించి కంపెనీలు తీసుకుంటున్నాయి. ఆయా కంపెనీలు ఇచ్చే ఇంటర్న్‌షిప్ కూడా చాలా ముఖ్యం. ఆషామాషీగా తీసుకోకుండా ఇంటిదగ్గర ఉంటూ చివరి మూడు నెలలు చేసే ఇంటర్న్‌షిప్‌ను ఆసక్తిగా చేయాలి. ఇందులో ఏమైనా తేడా వస్తే తిరస్కరిస్తాయి.

-సాంబశివరావు, ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్, తిరుమల ఇంజినీరింగ్ కాలేజీ, నరసరావుపేట

మార్కులు ప్రామాణికం కాదు



ఇంజినీరింగ్ విద్యార్థులకు అకడమిక్ మార్కులు ప్రామాణికం కాదు. ఇవి ఉద్యోగాలు సాధించిపెట్టవు. పరిశ్రమలో వస్తున్న మార్పులను గమనిస్తూ అందుకు తగ్గిన సర్టిఫికెట్ కోర్సులు నేర్చుకోవాలి. కనీసం మూడు అయినా అలాంటి కోర్సులు చేతిలో ఉండాలి. కోడింగ్‌లో మంచి నైపుణ్యం పెంపొందించుకోవాలి. జేఎన్‌టీయూలో విద్యార్థులకు నైపుణ్యంలో ఆరితేరేలా శిక్షణ ఇస్తున్నాం.

- కిశోర్‌బాబు, వైస్ ప్రిన్సిపల్, ప్లేస్‌మెంట్ సెల్ ఇన్‌ఛార్జి, జేఎన్‌టీయూ

సెపక్‌తక్రా జాతీయ పోటీలకు ఎంపిక

సత్తెనపల్లి గ్రామీణ: రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీల్లో సత్తా చాటిన క్రీడాకారులను గుర్తించి జాతీయ పోటీలకు ఎంపిక చేసినట్లు అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జి.శ్రీనివాసులు, రాష్ట్ర పరిశీలకుడు సి.మారుతిప్రసాద్ తెలిపారు. ఎంపికైన బాలురు మణిపుర్‌లో, బాలికలు నాగాలాండ్‌లో ఈనెలాఖరులో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. **బాలుర జట్టు:** ఎం.ఉమేష్ (కర్నూలు), ఎస్.శివకృష్ణ (ప్రకాశం), వై.రాహుల్ (పశ్చిమ గోదావరి), యు.వెంకటేష్ (నెల్లూరు), వై.విశ్వాస్‌పాల్ (తూర్పు గోదావరి), స్టాండ్‌బైలు ఎం.మణికంఠ (కర్నూలు), ఎస్.రోహిత్ (అనంతపురం), కె.శ్రీనాథ్ (గుంటూరు). **బాలికల జట్టు:** సి.మానస, కె.రమ్య (అనంతపురం), బి.ఉమాదేవి (కృష్ణా), షేక్ మనీషాబేగం (పశ్చిమ గోదావరి), ఎస్.హసీనా (కర్నూలు), స్టాండ్‌బైలు ఆర్.అమృత (కృష్ణా), జి.చైతన్యకుమారి (అనంతపురం), టి.యామిని (గుంటూరు).



మాట్లాడుతున్న ప్రేమ్‌కుమార్

మున్సిపల్ ఉపాధ్యాయుల సత్యాగ్రహ దీక్ష

నరసరావుపేట సెంట్రల్: మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి బుధవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన చేసి పదేళ్లు కావస్తున్నా నేటికీ ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు వర్తించే అన్ని సౌకర్యాలు, ఉత్తర్వులు మున్సిపల్ ఉపాధ్యాయులకు వర్తించటంలేదన్నారు. సబ్జెక్ట్ టీచర్ల కొరత, దశాబ్దాలుగా పదోన్నతులు లేకపోవడం, జీపీఎఫ్ ఖాతాలు తెరవకపోవడం, ఖాళీ పోస్టులు భర్తీ చేయకపోవటం వంటి సమస్యలతో మున్సిపల్ విద్యావ్యవస్థ కునారిల్లుతున్నట్లు పేర్కొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి విజయకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా సమస్యలు పరిష్కారం కావటం లేదన్నారు. దీక్షా శిబిరాన్ని ఎమ్మెల్యే అరవిందబాబు సందర్శించి ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.



మహాత్ముడి త్యాగాలు మరువలేనివి

గాంధీ జయంతి పురస్కరించుకుని కలెక్టరేట్‌లో బుధవారం ఆయన చిత్రపటానికి ఉన్నతాధికారులు నివాళి అర్పించారు. కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ మహాత్ముడి త్యాగాలు మరువలేనివని, ఆయన స్ఫూర్తితో జిల్లా ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కలెక్టరేట్‌లో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం నిర్వహించారు. కలెక్టరేట్ పరిసరాలను జిల్లా అధికారులతో కలిసి శుభ్రం చేశారు. జేసీ సూరజ్ గనోరే, డీఆర్వో వినాయకం, జిల్లా అధికారులు ఉన్నారు. **-న్యూస్‌టుడే, నరసరావుపేట అర్బన్**

ఓటు నమోదు చేసుకోండి

గుంటూరు: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదుకు నోటిఫికేషన్‌ను విడుదల చేసినట్లు కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. తహసీల్దార్, ఎంపీడీవో, రెవెన్యూ డివిజన్ కార్యాలయాల్లో ఓటరు దరఖాస్తు ఫారం-18 పూర్తి చేసి.. విద్యార్హతల నకళ్లు గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించి ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. నవంబరు 6లోపు నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని చెప్పారు.

బసవతారకం ఆస్పత్రిలో మహిళా రోగులకు ఉచిత కన్సల్టేషన్

హైదరాబాద్, న్యూస్‌టుడే: హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో ఈ నెల 20వ తేదీ వరకు మహిళా క్యాన్సర్ రోగులకు ఉచిత కన్సల్టేషన్ ఉంటుందని ఆసుపత్రి వర్గాలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపాయి. అక్టోబరును రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో 'స్క్రీనింగ్ ప్రోగ్రామ్ ఫర్ ఉమెన్' పేరిట ఈ సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. అన్ని పనిదినాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కన్సల్టేషన్ ఉంటుందని, మ్యామోగ్రామ్ పరీక్షల్లో 25 శాతం రాయితీ, ఇతర పరీక్షల్లో 10 శాతం రాయితీ ఇస్తున్నట్లు వెల్లడించారు. వివరాలకు 040-23551235, 23550967 నంబర్లను సంప్రదించవచ్చని సూచించారు.

స్ఫూర్తిప్రదాత గాంధీజీ



మహాత్ముడికి నివాళి అర్పించిన ఎస్పీ శ్రీనివాసరావు, పోలీసు అధికారులు

నరసరావుపేట టౌన్, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య సమరంలో మహాత్మాగాంధీ త్యాగాలు చిరస్మరణీయమని, ఆయన స్ఫూర్తిప్రదాత అని ఎస్పీ కంచి శ్రీనివాసరావు కొనియాడారు. నరసరావుపేట జిల్లా పోలీసు కార్యాలయంలో గాంధీ జయంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్ముడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఏఎస్పీ (అడ్మిన్) సంతోష్, ఏఎస్పీ (ఏఆర్) రామచంద్రరాజు, డీఎస్పీ నాగేశ్వరరావు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిరీక్షణ ఫలించి.. విజయం సాధించి

తెలంగాణ డీఎస్సీలో యువతుల ప్రతిభ

న్యూస్‌టుడే, నరసరావుపేట అర్బన్

పేద కుటుంబాలకు చెందిన ఆ యువతి చదువుపై మక్కువతో డీఈడీ పూర్తి చేశారు. ప్రభుత్వాల నోటిఫికేషన్ కోసం ఏళ్ల పాటు వేచి చూశారు. లక్ష్యసాధనకు పట్టిన పట్టు వీడకుండా సాధన కొనసాగించారు. అంతిమంగా విజేతలుగా నిలిచారు. తెలంగాణ డీఎస్సీ 2024లో రాణించి 8, 10 ర్యాంకులతో సత్తా చాటారు. పట్టణానికి చెందిన రుసుందార్ షబనాజ్ తెలుగు మాధ్యమంలో 83.5 మార్కులతో 8వ ర్యాంకు సాధించింది. షేక్ బషీరా ఉర్దూ మాధ్యమంలో 68.83 మార్కులతో పదో ర్యాంకు సాధించింది.



రుసుందార్ షబనాజ్



షేక్ బషీరా

అందరికీ విద్య అందాలి

నవోదయనగర్‌కు చెందిన రుసుందార్ షబ్‌నాజ్ తండ్రి కమర్ హుస్సేన్ జల వనరుల శాఖలో అటెండర్. తల్లి నసీమా గృహిణి. చిన్నతనం నుంచి చురుగ్గా ఉండే షబ్‌నాజ్ 2018లో డీఈడీ పూర్తి చేసింది. 2022 టీఎస్ టెట్‌లో 5వ ర్యాంకు, ఏపీ టెట్‌లో 3వ ర్యాంకు సాధించింది. సెంట్రల్ టెట్‌లో ఉమ్మడి రాష్ట్రంలో ప్రథమ ర్యాంకు దక్కించుకుంది. డీఎస్సీ నోటిఫికేషన్ల వెలువడక సమయాన్ని సద్వినియోగం చేసుకుని దూరవిద్యా కేంద్రం ద్వారా బీఏ సాహిత్యంలో డిగ్రీ పూర్తి చేసింది. తాజాగా తెలంగాణ డీఎస్సీ పరీక్షల్లో రాణించి 8వ ర్యాంకు సాధించింది. విద్య ద్వారానే సమాజంలో గౌరవంతో పాటు కుటుంబం అభివృద్ధి చెందుతుందని నమ్ముతానని ఆమె తెలిపింది. సాధన సమయంలో శిక్షకుడు కంచెర్ల నరేంద్ర అందించిన సహకారం మరువలేనిదని తెలిపింది.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగు

అరండల్‌పేటకు చెందిన షేక్ బషీరా తండ్రి సత్తార్ టైలరింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. తల్లి ఖద్దిజాబీ టైలరింగ్‌లో భర్తకు సహకరిస్తుంటారు. వచ్చే కొద్దిపాటి ఆదాయమే కుటుంబానికి ఆధారం. ఆర్థిక సమస్యల కారణంగా ముగ్గురు సంతానం అయినా ఒకరినే చదివించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో 2018లో డీఈడీ పూర్తి చేసింది. పట్టణంలోని హరిణి అకాడమీలో డీఎస్సీకి శిక్షణ పొందింది. 2022లో ఏపీ టెట్‌లో 130 మార్కులతో 5వ ర్యాంకు సాధించింది. డీఎస్సీ నోటిఫికేషన్ల కోసం వేచి చూసి బీఏ సాహిత్యంలో డిగ్రీ పూర్తి చేసింది. ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలల్లో ఉర్దూ బచ్చిం కాంతంగా తీసుకున్న విద్యార్థులకు బోధన చేస్తోంది. తాజాగా తెలంగాణ డీఎస్సీలో రాణించి పదో ర్యాంకు సాధించింది. పేద, మధ్య తరగతి పిల్లలు ఎక్కువగా చదువుకునే ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచేలా బోధన చేస్తానని ఆమె పేర్కొంది.



ఆందోళన చేస్తున్న గోపీనాయక్ తల్లిదండ్రులు, బంధువులు

వివాహేతర సంబంధంతోనే హత్య

☛ స్టేషన్ ఎదుట మృతుడి తల్లిదండ్రుల ఆందోళన

☛ కోడలు, ఆమె ప్రియుడిపై చర్యలకు డిమాండ్

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: వివాహేతర సంబంధం పెట్టుకున్న కోడలు తమ కుమారుడికి విషప్రవాకం తాపించి హతమార్చిందని మృతుడి తల్లిదండ్రులు, బంధువులు మాచర్ల పోలీస్ స్టేషన్ వద్ద బుధవారం ఆందోళన చేశారు. బాధితుల వివరాల మేరకు.. మాచర్ల మండలం కింగరుట్లతండాకు చెందిన నాగేశ్వరనాయక్, సోనాబాయిలకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు గోపీనాయక్ (32) తన సోదరి కుమార్తె హనిమీబాయిని వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు, ఒక మగ సంతానం. పొలం పనులు చేస్తూ జీవిస్తున్నారు. అయితే హనిమీబాయి మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ విషయం తెలిసి భర్త పలుమార్లు ప్రశ్నించడాన్ని అతడి తల్లిదండ్రులు తెలిపారు. ఈక్రమంలోనే భర్త అడ్డు తొలగించుకునేందుకు శీతల పానీయంలో విషద్రావకం కలిపి ఇచ్చింది. దీంతో అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గోపీనాయక్ గత మంగళవారం మృతి చెందాడని పేర్కొన్నారు. వైద్యులు పరీక్షలు చేసినప్పుడు పురుగుమందు తాగినట్లు గుర్తించారన్నారు. తమ కుమారుడి మృతికి కారణమైన కోడలు, ఆమె ప్రియుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఐ శ్రీనివాసరావు బాధితులకు నచ్చజెప్పి పంపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

అమ్మవారికి నాణేల దండ



నాణేలతో తయారు చేసిన దండ



కరెన్సీతో రూపొందించిన..

దసరా నవరాత్రి ఉత్సవాలకు అచ్చంపేటలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని అలంకరించేందుకు కరెన్సీ నోట్లు, నాణేల కూర్పుతో దండలను సిద్ధం చేశారు. గురువారం ఉదయం మంగళవాద్యం, తోరణం, సుప్రభాతంతో విశేష పూజలు మొదలవుతాయి. ఈ మేరకు పూజా కార్యక్రమాలు, అలంకరణల వివరాలతో కరపత్రాలను విడుదల చేశారు. కమిటీ అధ్యక్షుడు వీరవెంకటసుబ్బారావు, జీవితకాల తదితరులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, అచ్చంపేట

పులిచింతలలో మొసలి



పులిచింతల ప్రాజెక్టు మొసలి

అచ్చంపేట (క్రోసూరు): పులిచింతల ప్రాజెక్టు వంతెనపై బుధవారం తెలవారుజామున మొసలి ప్రత్యక్షం కావడంతో కలకలం రేగింది. మూడు నెలల నుంచి ప్రాజెక్టుకు భారీ నీరు చేరుకోవడంతో మొసలి ఎగువ ప్రాంతం నుంచి వచ్చి ఉంటుందని భావిస్తున్నారు. ప్రాజెక్టు వంతెనపై తెలంగాణ, ఆంధ్ర ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. వారంతా భయభ్రాంతులకు గురయ్యారు. ఊరి వెలుపల వదిలేశారు.

చిరుదొనపాడు కాలనీలో..: అచ్చంపేట మండలం రోకటిగుంట వారిపాలెం పంచాయతీ చిరుదొనపాడు పునరావాస కేంద్రం కాలనీలో బుధవారం కొండ చిలువ కలకలం రేపింది. గరిక పాటి బ్రహ్మయ్య ఇంట్లోకి ప్రవేశించిన కొండ చిలువను కుటుంబ సభ్యులు గమనించారు. అప్పటికే కోడిని మింగుతోంది. కోడిని రక్షించే క్రమంలో కొండ చిలువను స్థానికులు చంపారు.

గుడిపాడులో కొండచిలువ: క్రోసూరు మండలం గుడిపాడు గ్రామంలో మంగళవారం రాత్రి కొండచిలువ కనిపించింది. రోడ్డుపై కనిపించడంతో గ్రామస్థులు పట్టుకుని



కొండచిలువతో గ్రామస్థుడు

సెపక్‌తక్రా పోటీల బాలుర విజేత కర్నూలు



కర్నూలు జట్టుకు కప్ అందిస్తున్న తెదేపా నేతలు

సత్తెనపల్లి గ్రామీణ: పెదమక్కెనలో రెండ్రోజులపాటు జరిగిన స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి అండర్-19 బాలబాలికల సెపక్‌తక్రా ఆటల పోటీలు బుధవారం ముగిశాయి. బాలుర విభాగంలో తుది పోరులో ప్రకాశం జిల్లా జట్టుపై కర్నూలు జట్టు గెలిచి విజేతగా నిలిచింది. ప్రకాశం జట్టు రెండు, పశ్చిమ గోదావరి జట్టు మూడో స్థానాన్ని దక్కించుకున్నాయి. బాలికల విభాగంలో తుది పోటీలో కృష్ణా జట్టుపై అనంతపురం జట్టు గెలిచింది. కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లా జట్లు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. విజేతలకు తెదేపా నాయకులు, అధికారులు కప్పులు, జ్ఞాపికలు అందించారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ కృష్ణస్వామి, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త వెంకటఅప్పారావు, సర్పంచి అన్నపూర్ణమ్మ, రైతు నేతలు ఉన్నారు.



బాలికల జట్టుతో జిల్లా కార్యదర్శి, పీడీలు

జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు జట్ల ఎంపిక

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: వినుకొండ లయోల పాఠశాలలో గతనెల 28, 29, 30 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించి త్వరలో జమ్ము కశ్మీర్‌లో నిర్వహించే జాతీయ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర బాల, బాలిక జట్లను ఎంపిక చేసినట్లు స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి సురేష్‌కుమార్ తెలిపారు. ఎంపికలో అన్ని జిల్లాల కార్యదర్శులతో పాటు స్థానిక పీడీలు లయోల, రాధాకృష్ణమూర్తి, చిరంజీవి, వీరాంజనేయులు, వెంకటరత్నం, ఆనూరాధ, రాజేష్, జోనావాయక్, పీఈటీలు 70 మంది సూచనల మేరకు జట్లను ఎంపిక చేసినట్లు చెప్పారు.

బాలుర జట్టు సభ్యులు: నెహల్, భరత్‌సాయి, గురుచరణ్, రాజేష్ (విశాఖపట్నం), అమరనాధ్, అరవింద్, దినేష్ (అనంతపురం), అలీ, నాగార్జున, నవీన్ (గుంటూరు), శామ్యూల్ దాసన్ క్యార, అభినవ్ (తూర్పు గోదావరి), చరణ్ వెంకట ప్రవ, నరేష్ (చిత్తూరు), గౌతమ్ (కడప), హర్షప్రదీప్ (కృష్ణా), జాన్ (ప్రకాశం), ద్రావన్ (పశ్చిమ గోదావరి), స్టాండ్‌బైగా సభ్యులుగా సోహెల్ తన్వీర్ (గుంటూరు), సాత్విక్, తంలిస్ (విశాఖపట్నం), సాత్విక్ (తూర్పు గోదావరి).

బాలికల జట్టు సభ్యులు: భువన, రోహిణి, వాసవి, వెన్నెల (కడప), నేహ్న అభిరూప (నెల్లూరు), జబీలావణ్య (పశ్చిమ గోదావరి), రమ్య (విశాఖపట్నం), శ్రీహిత (కర్నూలు), విష్ణుప్రియ, మాధురి, రక్షిత (చిత్తూరు), సుశీల (కృష్ణా), మహిశ్రీ, ప్రవల్లిక, వాసవి (గుంటూరు), వర్షిత, ప్రణతిరెడ్డి, అఖిల (అనంతపురం), స్టాండ్‌బైగా ఆసిఫా సుల్తానా (చిత్తూరు), రోహితరెడ్డి (కడప), జన్యా స్వరూప (పశ్చిమ గోదావరి), సుస్మిత (తూర్పు గోదావరి), స్వాతి (అనంతపురం).

ఖోఖో జిల్లా జట్లు..



ఎంపికైన విద్యార్థులు

కారంపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఖోఖో జిల్లా జట్ల ఎంపిక బుధవారం జరిగింది. స్థానిక బ్రహ్మనాయుడు జడ్పీ ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా 14 ఏళ్లలోపు బాల, బాలికల జట్ల ఎంపికలు నిర్వహించారు. బాలుర జట్టుకు కేశవ, అఖిల్, జీవన్ (కారంపూడి), రవికిరణ్, మనోహర్ (ఒప్పిచర్ల), ఆంజనేయులునాయక్ (వినుకొండ), కమలేష్ (నరసరావుపేట), రహూల్ (నకరికల్లు), కిరణ్‌కుమార్ (క్రోసూరు), రాజు (విజయపురిసౌత్), లక్ష్మణ్ (తాడికొండ), శ్రీకాంత్ (ఈపూరు), స్టాండ్ బైలు రామబ్రహ్మం (ముప్పాళ్ల), మణికుమార్ (నిడమర్రు), వరప్రసాద్, సాయి నాయక్ (కారంపూడి)... బాలికల జట్టుకు ఉమాహర్షిత (వెల్దుర్తి), లక్ష్మీ ప్రసన్న (ఒప్పిచర్ల), సంజనామాధురి (మంగళగిరి), వైష్ణవి (ఎస్‌బీ పురం), నాగమణి (వినుకొండ), దేవి, హర్షిత (కారంపూడి), పద్మ (రెంటచింతల), శ్రీలక్ష్మి (రొంపిచర్ల), ఐశ్వర్య (చిలకలూరిపేట), చౌడేశ్వరి (రెంటాల), దీక్షిత సింధు (నరసరావుపేట), స్టాండ్‌బైలు మహిమస్సిసా (ఒప్పిచర్ల), దీపిక (పెదకూరపాడు), శ్రీహర్షిత (మంగళగిరి) ఎంపికయ్యారు.

మహాత్ముడి గుడి ప్రారంభం



గాంధీ గుడి ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట అర్బన్: సత్యం, అహింసతో పాటు మనిషి ఆచరించాల్సిన పలు అంశాలను మహాత్మాగాంధీ తెలిపారని.. వాటిని ప్రచారం చేయాలని ఎమ్మెల్యే అరవిందబాబు అన్నారు. ప్రకాశ్‌నగర్‌లో మహాత్మాగాంధీ ఛారిటబుల్ నిర్మించిన గాంధీ గుడిని బుధవారం ప్రారంభించారు. విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి మేరా భూపాల్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

తెదేపా, వైకాపా వర్గీయుల ఘర్షణ

గురజాల, న్యూస్‌టుడే: గురజాల మండలం గోగులపాడు గ్రామంలో బుధవారం రాత్రి తెదేపా, వైకాపా వర్గీయుల మధ్య ఘర్షణ జరిగింది. గొడవ తొలుత స్థలం లో వస్తున్నాయన్న విషయంపై గొడవ మొదలైంది. ఆ గొడవ చివరికి దాడులకు దారితీసింది. ఆ దాడుల్లో తెదేపా వర్గీయులు ఇంజమూరి అజయ్, ఇంజమూరి శిపాయి గాయపడ్డారు. వారిని నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



గాయపడిన అజయ్



శిపాయి

దేవాలయాలను ధార్మిక సంస్థలకు అప్పగించాలి

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో దేవాలయాలను హిందూ ధార్మిక సంస్థలకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. హిందూ ఆలయాలను అపవిత్రం చేస్తూ, రాజకీయంగా, ఆదాయ వనరుగా ఉపయోగించుకుంటూ దేవాలయ వ్యవస్థలను భ్రష్టు పట్టిస్తున్నారని వక్తలు తెలిపారు. ఆలయాల్లో రాజకీయాల జోక్యం లేకుండా దేవాదాయ శాఖను రద్దు చేయాలని, ఆలయాల నిర్వహణను సనాతన హిందూ మండలికి, హిందూ ధార్మిక సంస్థలకు అప్పగించాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు భాగవతుల రవికుమార్, ఏవీఆర్‌కే సత్యనారాయణ, జొన్నలగడ్డ రాజేశ్వరి తదితరులు ఉన్నారు.

గిరిజన వికాసానికి చేయూత

❖ పీఎం - జుగాకు ఏడు ఆవాసాల ఎంపిక ❖ మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం

వినుకొండ, నరసరావుపేట అర్బన్, బొల్లాపల్లి, న్యూస్‌టుడే



గండిగనుమల తండా

గిరిజనుల నివాస ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు, సామాజిక ఆర్థిక అభివృద్ధి కోసం ప్రధానమంత్రి జన జాతీయ ఉన్నత్ గ్రామ్ అభియాన్ యోజన (పీఎం - జుగా) పథకాన్ని ఈ ఏడాది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్నాయి. ఇందుకు పల్నాడు జిల్లాలో వెనకబడిన ఏడు గిరిజన ఆవాసాలను ఎంపిక చేశారు. అక్కడ చేపట్టే పనులకు గిరిజన సంక్షేమ శాఖ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుండగా ఇందులో 17 మంత్రిత్వ శాఖల పాలు పంచుకోనున్నాయి. గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న ప్రధాని నరేంద్ర మోదీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

మౌలిక సదుపాయాలకు పెద్దపీట: ఈ పథకంలో ఆరు లేని వారికి పక్కా గృహాలు, విద్యుత్తు సౌకర్యం, తాగునీటి సరఫరా, ఆయుష్మాన్ భారత్ కార్డులు అందిస్తారు. అంతర్గత రహదారుల నిర్మాణం, మొబైల్ కనెక్టివిటీ, ఇంటర్నెట్, ఆరోగ్య, పోషకాహార, విద్య మౌలిక సదుపాయాలు కల్పిస్తారు. గిరిజనుల్లో వృత్తి నైపుణ్య శిక్షణ, అందరికీ విద్యపై చర్యలు చేపడతారు. ఇలా 25 రకాల సదుపాయాలు కల్పిస్తారు. పాఠశాలలు, గురుకులాలు, వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తారు. గ్రామీణ రహదారుల అంచనాలను పంచాయతీరాజ్ శాఖ పంపింది. అలాగే మిగిలిన శాఖలు సిద్ధం చేసిన అంచనాలను కేంద్రానికి ప్రతిపాదించాలి. వీటిని పరిశీలించి నిధులు మంజూరు చేస్తుంది. అవకాశాన్ని అందిపుచ్చుకోవాల్సిన బాధ్యత స్థానిక యంత్రాంగంపై ఉంది.

ఎంపికైన గ్రామాల వివరాలు

మండలం పేరు	గ్రామం
మాచర్ల	నాగులవరం
బొల్లాపల్లి	అయ్యన్నపాలెం, కనుమలచెరువు, గండిగనుమల
దాచేపల్లి	భట్రుపాలెం
అచ్చంపేట	మాదిపాడుసెగి
దుర్గి	నిదానంపాడు

నమ్మించి భార్య హత్య

అనుమానంతో దారుణం



త్రివేణి మృతదేహం

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: నాకు అనారోగ్యంగా ఉంది... నరసరావుపేట వెళ్లి ఆసుపత్రిలో చూపించుకుని వద్దామని భార్యను నమ్మించి కత్తితో హత్య చేసిన భర్త ఉదంతమిది. గ్రామీణ పోలీసుల కథనం మేరకు.. బెల్లంకొండ మండలం వన్నాయపాలెనికి చెందిన బోనం త్రివేణి, మణికృష్ణ దంపతులు. వీరికి ఇద్దరు పిల్లలు. అయితే త్రివేణి ప్రవర్తనపై కొంతకాలంగా అనుమానం పెంచుకున్న భర్త ఎలాగైనా భార్యను కడతేర్చాలని నిర్ణయించుకున్నాడు. బుధవారం ఉదయం ఆనారోగ్యంగా ఉంది, నరసరావుపేట వెళ్లి చూపించుకొని వద్దామని నమ్మించి ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని నరసరావుపేటకు బయల్దేరాడు. మార్గమధ్యలో పమిడిపాడు గ్రామ శివారులో జన సంచారం లేని చోట పథకం ప్రకారం త్రివేణిని కత్తితో పొడిచి హత్య చేసి అనంతరం హైదరాబాద్‌కు పయనమయ్యాడు.

108 సిబ్బంది సమాచారంతో...

మార్గమధ్యలో కారంపూడి సమీపానికి చేరుకోగానే గుర్తు తెలియని వాహనం ఇతని ద్విచక్ర వాహనాన్ని ఢీకొని తీవ్రగాయాలు అయ్యాయి. 108 సిబ్బంది ఆసుపత్రికి తరలించారు. వారు ఎక్కడికి వెళుతున్నావు, ఏ ఊరు అని అడగగా భార్యను చంపి హైదరాబాద్ వెళుతున్నానని చెప్పాడు. వారిచ్చిన సమాచారం మేరకు నరసరావుపేట గ్రామీణ సీఐ రామకృష్ణ, ఎస్సైలు కిషోర్, ప్రియాంక హత్య సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. అప్పటికే త్రివేణి మృతి చెంది ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిషోర్ తెలిపారు. మృతురాలికి ఇద్దరు పిల్లలున్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో రూ.లలో)

వినుకొండ: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 121, రిటైల్ ధర 143, చికెన్ విత్‌స్కిన్ - 207, చికెన్ స్కిన్‌లెస్ - 236.

కృష్ణా జిల్లాలో: వెనకోబ్: లేయర్ ఫారం లిఫ్టింగ్ ధర -116 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228.

గుంటూరు: షెల్లి పార్మర్స్ & బ్రీడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 123, 132, 142 చికెన్ విత్ స్కిన్ - 230 చికెన్ స్కిన్‌లెస్ - 240.

నెక్ సూచించిన కోడిగుడ్డు ధర

తణుకు నెక్ విజయవాడ జోన్ సూచించిన ఫారం కోడిగుడ్డు ధర 100 గుడ్లు రూ. 565 (రవాణా & పత్రిక సమాచార కేంద్రం) విశాఖపట్నం నెక్ జోన్ ఫారం కోడిగుడ్డు ధర రూ.5.. ఉన్నాయి.

బార్‌లో మందుబాబుల వీరంగం

యజమానితో సహా ముగ్గురికి గాయాలు

నరసరావుపేట టౌన్, న్యూస్‌టుడే: నరసరావుపేట పట్టణంలోని ఓ బార్‌లో అతిగా మద్యం తాగి అప్పు అడుగడం, లేదన్న కారణంగా అదే బార్ యజమాని, ఇద్దరు సిబ్బందిపై దాడి చేసి గాయపరిచిన ఘటన ఇది. పోలీసుల వివరాల ప్రకారం.. పట్టణంలోని వినుకొండ రోడ్డులోని జీవన్ జ్యోతి బార్‌లో మంగళవారం రాత్రి స్థానిక ఇస్లాంపేటకు చెందిన వంశీ తన మిత్రులతో కలిసి అతిగా మద్యం తాగాడు. తన వద్ద డబ్బులు లేవని.. బిల్లు అప్పుగా ఇవ్వాలంటూ మిత్రులతో కలసి సిబ్బందితో గొడవ పెట్టుకున్నారు. బల్లపై ఖాళీ సీసాలు పగలగొట్టి వీరంగం సృష్టించారు. దీనిని వారించిన యజమాని బెల్లంకొండ శ్రీను, మేనేజరు సోమశంకర్, సిబ్బందిపై దాడి చేశారు. దుకాణంలోని సరుకు ధ్వంసం చేశారు. గాయపడిన ముగ్గురిని ఆసుపత్రికి తరలించారు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మేనేజరు ఫిర్యాదు మేరకు అతనితో పాటు మొత్తం ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై హైమారావు తెలిపారు.

నరసరావుపేట

•నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట



మామిడి తోరణాలు కట్టి...

రొంపిచర్ల: మండలంలోని వడ్లమూడివారిపాలెంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం డంపింగ్ యార్డు కేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చారు. పరిసరాలు శుభ్రం చేసి మామిడి తోరణాలు కట్టి సంపద కేంద్రాన్ని ముస్తాబు చేశామని పంచాయతీ కార్యదర్శి నర్సిరెడ్డి తెలిపారు. హరిత రాయబారులను సన్మానించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మల్లమ్మసెంటర్ (నరసరావుపేట) : 6300021363
చిలకలూరిపేట గ్రామీణ : 8008883217 శావల్యాపురం : 8008573165

? మండలంలోని మురికిపూడిలో గ్రానైట్ లారీలు ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నాయి. పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలి. **-శ్రీకాంత్, మురికిపూడి**

✔ ఇప్పటికే పలుమార్లు గ్రానైట్ క్వారీల యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లాం. ఊరిలో నుంచి కాకుండా బయటి నుంచి వెళ్లేలా చర్యలు తీసుకుంటాం. **-బాపిరాజు, పంచాయతీ కార్యదర్శి**

? బొప్పూడి సచివాలయం పక్కనే చెత్త వేస్తున్నారు. ఊరికి దూరంగా వేసేలా చర్యలు తీసుకోవాలి. **-పవన్, బొప్పూడి**

✔ ఇక నుంచి అక్కడ చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటాం. **-క్రాంతి, పంచాయతీ కార్యదర్శి**

–చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే

రెండు రేషన్ దుకాణాల విభజన


ఈపూరు : మండలంలో రెండు ప్రజా పంపిణీ దుకాణాల విభజన కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తహసీల్దారు నళిని తెలిపారు. అగ్నిగుండాల 1లో 864 కార్డులు, ఇనుమెళ్ల 10లో 810 కార్డులున్నాయని, 800 రేషన్ కార్డులు దాటితే రెండో దుకాణం ఏర్పాటు చేయాలన్నారు. ఈ గ్రామాల్లో ఒక్కొక్కటి చొప్పున అదనంగా రెండు దుకాణాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయుల తొలగింపు

యడ్లపాడు, న్యూస్‌టుడే : మండలంలోని వంకాయలపాడులోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలోని పదో తరగతి విద్యార్థులు గత నెల 23న పారిపోయిన ఘటనకు సంబంధించి ఉపాధ్యాయులపై చర్యలు తీసుకున్నట్లు గురుకుల పాఠశాలల జిల్లా కో-ఆర్డినేటర్ పద్మజ బుధవారం తెలిపారు. కొందరు ఉపాధ్యాయులు ఉద్దేశపూర్వకంగా విద్యార్థులను పాఠశాల విడిచి వెళ్లేలా రెచ్చగొట్టినట్లు విచారణలో తేలిందన్నారు. ఇందుకు బాధ్యులైన పార్ట్‌టైం ఉపాధ్యాయులు జి.నవీన్‌కుమార్, ఎన్.అశోక్, కె.రమేష్, డి.స్వర్ణరాజు, వాలి అహ్మద్‌ను ఉద్యోగం నుంచి తొలగించినట్లు వెల్లడించారు.

ఏమైపోయారు వీళ్లంతా?

అంతు చిక్కని అదృశ్యాలు ★ చేధనలో పోలీసులకు సవాల్



మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), వినుకొండ రూరల్, చిలకలూరిపేట (గ్రామీణ, న్యూస్‌టుడే

వివిధ కారణాలతో ఇంటి నుంచి కనిపించకుండా పోతున్న కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. వీటిలో ఆచూకీ తెలియని వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఈ సంఖ్య ఏటేటా పెరుగుతోందే తప్ప తరగడం లేదు. కనిపించకుండా పోతున్న వారిలో మహిళలతో పాటు పురుషులు ఉంటున్నారు. ఇటీవల జిల్లాలో అదృశ్యం కేసులతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పలు కేసుల్లో కొంతమంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కొందరు తిరిగి వచ్చినా నమోదు చేయడంలో పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఆ తరహా కేసులను చేధించడంలో పూర్తిగా విఫలమవుతున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఆగస్టులో నమోదైన కేసులు

★ మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్ జిల్లా బర్రై గ్రామానికి చెందిన 51 ఏళ్ల నేమీచంద్ మీనా కుటుంబసమేతంగా గత నెల 3న కోటప్పకొండ దర్శనానికి వచ్చారు. మధ్యాహ్నం స్వామిని దర్శించుకుని బయటకు వచ్చేసరికి కనిపించకుండా పోయాడని కుటుంబసభ్యులు నరసరావుపేట గ్రామీణ పోలీసులను ఆశ్రయించారు.

★ నాదెండ్ల ఎస్సీ కాలనీకి చెందిన దావులూరి నవీన్ అనే బాలుడు గత నెల 12న అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

★ బొల్లాపల్లి మండలం రావులాపురానికి చెందిన యలగాల వెంకటేష్ ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పని చేస్తున్నాడు. శనివారం రాత్రి వినుకొండ నుంచి రావులాపురం వెళుతూ మార్గమధ్యలో మూగచింతలపాలెం వద్ద బస్సు దిగి కుటుంబసభ్యులకు కాల్వలో దూకుతున్నట్లు సమాచారమిచ్చాడు. దీంతో బంధువులు వెతకటం ప్రారంభించి బండ్లమోటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే రోజు చిలకలూరిపేట మురికిపూడికి చెందిన నాగరాజు తన భార్య సుధారాణితో మనస్పర్థలు రాగా పుట్టింట్లో ఉన్న ఆమెను చిలకలూరిపేటలో వదిలి వెళ్లాడు. అప్పటి నుంచి సుధారాణి కనిపించడం లేదని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

★ వినుకొండకు చెందిన షేక్ నదియా తన భర్త బొలాలి జాబిలి 8 నుంచి కనిపించడం లేదని ఆగస్టు 20న ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది. తన భర్త కనిపించకపోవడానికి తన బంధువులే కారణమని ఫిర్యాదులో పేర్కొంది.

అనేక కారణాలు

అదృశ్యమయ్యే కేసుల విషయంలో చాలా కారణాలు కనిపిస్తున్నాయి. ప్రధానంగా కుటుంబ కలహాలు, వివాహేతర సంబంధాలు, ప్రేమ వ్యవహారాలు తదితర కారణాలతో ఇళ్ల నుంచి వెళ్లి పోతున్నారు. ఇందులో తల్లిదండ్రుల మధ్య సఖ్యత లేకపోవడం, వ్యసనాల బారిన పడి ఇంటిలో గడపలేక, ప్రేమను తిరస్కరించడం వంటి కారణాలతో యువత అదృశ్యమవుతోంది.

కేసులు పరిష్కరిస్తాం

కుటుంబ కలహాలతో అదృశ్యమయ్యే కేసులు ఎక్కువగా ఉంటున్నాయి. మనస్పర్థలతో ఇంటి నుంచి బయటకు వెళ్లిన వారు తిరిగి రావడం లేదు. వాళ్ల చరవాణి కాల్ డేటా ఆధారంగా కనిపెట్టి వారివారి కుటుంబ సభ్యులకు అప్పగిస్తాం.

-నాగేశ్వరరావు, నరసరావుపేట డీఎస్పీ

సెప్టెంబరులో నమోదైన కేసుల వివరాలు

★ రొంపిచర్ల మండలం దాసరిపాలెం (రామిరెడ్డిపేట) వీఆర్‌ఏ బుట్టి యోహాన్ కనిపించడం లేదని 3న కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. కర్లకుంటకు చెందిన యోహాన్ దాసరిపాలెం వీఆర్‌ఏ. సోమవారం వ్యక్తిగత పని నిమిత్తం నరసరావుపేట వచ్చాడు. తిరిగి గ్రామమైన కర్లకుంట వెళ్లడానికి రొంపిచర్ల విద్యుత్తు ఉప కేంద్రం వద్ద బస్సు దిగి అతని కుమారుడికి ఫోన్ చేశాడు. కుమారుడు ద్విచక్ర వాహనం తీసుకుని రొంపిచర్ల వచ్చాడు. అప్పటి నుంచి తండ్రి ఆచూకీ తెలియలేదని రొంపిచర్ల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

★ నరసరావుపేట పట్టణం రామిరెడ్డిపేటకు చెందిన షేక్ నాగూరు వుటిలీరాల్ల పండ్లు విక్రయిస్తుంటాడు. ఆయన భార్య గౌసియా ఏనిమిది నెలల క్రితమే అనారోగ్యంతో మరణించగా స్థానిక మహిళ రమీజాతో పరిచయం ఏర్పడి ఆమె వద్దే ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల తరచూ వారి మధ్య గొడవలు జరుగుతూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో నెల రోజులుగా తన అన్న నాగూరు కనిపించడం లేదని, ఆమెపైనే తనకు అనుమానం ఉందని అతని సోదరుడు చిన్ననాగూరు ఇచ్చిన ఫిర్యాదు చేశాడు.

★ వినుకొండ ఇందిరానగర్‌కు చెందిన బత్తుల బాలరాజు ఈ నెల 18న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదని అతని భార్య బాల గురవమ్మ వినుకొండ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

మద్యం దుకాణాలకు టెండర్లు

వినుకొండ, న్యూస్‌టుడే : ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ వినుకొండ సర్కిల్ స్టేషన్ పరిధిలో 14 మద్యం దుకాణాలకు టెండర్లు పిలిచినట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. పురపాలక సంఘం, నూజండ్ల దుకాణాలకు లైసెన్స్ ఫీజు రూ.65 లక్షలు, శావల్యాపురం, వినుకొండ రూరల్‌లో దుకాణాలకు ఒక్కొక్క దానికి రూ.55 లక్షలు నిర్ణయించినట్లు తెలిపారు. టెండర్‌లో పాల్గొనడానికి వాపస్ ఇవ్వని ఫీజు రూ.2 లక్షలుగా నిర్ణయించినట్లు చెప్పారు. 11న నరసరావుపేట టౌన్‌హాల్లో డ్రా తీస్తారని, టెండర్ దాఖలుకు తమ స్టేషన్‌లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

విద్యార్థులు సొంతూళ్లకు ప్రయాణం

★ అన్నింటా సాధారణ ఛార్జీలు ★ కిటకిటలాడిన బస్టాండ్

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే : దసరా పురస్కరించుకుని సెలవులకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులకు ఆర్టీసీ తీపి కబురు అందిస్తోంది. ప్రత్యేక బస్సుల్లో సాధారణ ఛార్జీలు వసూలు చేయాలని నిర్ణయించింది. వీటిలో ఇప్పటికే రిజర్వేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. రానూ, పోనూ ఒకేసారి ముందస్తు రిజర్వేషన్ చేసుకుంటే పది శాతం రాయితీ అమలు చేస్తున్నామని నరసరావుపేట డిపో మేనేజరు వీరాస్వామి పేర్కొన్నారు. ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. అక్టోబరు 2 గాంధీ జయంతి, అనంతరం దసరా నేపథ్యంలో కళాశాలకు సెలవులు ప్రకటించగా విద్యార్థులు సొంతూర్లకు ప్రయాణమయ్యారు. దీంతో బుధవారం ఆర్టీసీ బస్టాండ్ కిటకిటలాడింది.



నరసరావుపేట బస్టాండ్‌లో రద్దీ

చిన్న వర్షం పడినా చింతే



గుడి ముందు నిలిచిన నీరు

చిలకలూరిపేట చౌత్రా సెంటర్ సమీపంలోని వీరాంజనేయస్వామి గుడి ముందు చిన్న వర్షం పడినా గుంతలో నీరు నిలిచి పుర ప్రజలతో పాటు భక్తుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. పురపాలక అధికారులు, సిబ్బంది చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, చిలకలూరిపేట గ్రామీణ**

ప్రమాదాలు జరుగుతున్నా పట్టదా?

జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో కొన్ని రహదారుల్లో రాత్రిపూట అంధకారం రాజ్యమేలుతోంది. వీధి దీపాలు సక్రమంగా వెలగక చీకట్లోనే ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ సమయంలో వాహన ప్రమాదాలు జరుగుతున్నాయి. సత్తెనపల్లి రోడ్డులోని స్టేడియం నుంచి అయ్యప్ప స్వామి ఆలయం వరకు సెంట్రల్ లైటింగ్ దీపాలు ఎప్పుడు వెలుగుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. అధికారులు సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, నరసరావుపేట టౌన్**



వెలగని వీధి దీపాలు

డిగ్రీ కళాశాలలో ఉద్యోగమేళా

వినుకొండ, న్యూస్‌టుడే : స్థానిక గంగినేని కల్యాణి, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇ.తమ్మాజిరావు తెలిపారు. దత్తా ఆసుపత్రి, మాస్టర్‌మైండ్స్, ఇలా అగ్రిసర్వీసెస్, సింధూజ మైక్రో క్రెడిట్స్ వంటి పలు సంస్థలు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి, ఆపైన చదువుకొని 18- 40 ఏళ్ల మధ్య ఉన్న యువత పూర్తి వివరాలతో రావాలని ఆయన సూచించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తామని చెప్పారు.

పేదలకు అన్నదానం

వినుకొండ : విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం పేదలకు అన్నదానం నిర్వహించారు. పదేళ్లుగా సంఘ సేవా కార్యక్రమాలను సంఘ నేత భువనగిరి సుబ్రహ్మణ్యం వివరించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు లేళ్ల హనుమంతరావు తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం అన్నదానం చేశారు. పలువురు విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

మద్యం సీసాల పట్టివేత

యద్దనపూడి, న్యూస్‌టుడే: అక్రమంగా మద్యం సీసాలు తరలిస్తున్న నరసరావుపేటకు చెందిన పల్లపు గిరిధర్ మణికంఠను ఎస్సై రత్నకుమారి బుధవారం అరెస్టు చేసినట్లు తెలిపారు. అక్రమంగా 14 మద్యం సీసాలు తరలిస్తుండగా బస్టాండు కూడలి వద్ద అదుపులోకి సీజ్ చేసినట్లు వెల్లడించారు.

బాపూజీ బాటలో నడుద్దాం

వినుకొండ, న్యూస్‌టుడే : దేశ శ్రేయస్సు శుభ్రతతో ముడిపడి ఉందని నాడు మహాత్ముడి చెప్పిన మాటకు కట్టుబడి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'స్వచ్ఛభారత్' కింద వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించినట్లు ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తెలిపారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని బుధవారం పాత కూరగాయల మార్కెట్ వద్ద బాపూజీ విగ్రహానికి వాసవీ క్లబ్ సభ్యులతో కలిసి పూలమాల వేశారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవా ముగింపు సందర్భంగా ఎన్నెస్పీ కాలనీ షిర్డీసాయి మందిరం వద్ద పిచ్చి మొక్కలు తొలగించి.. చీపుర్లతో శుభ్రం చేశారు. అంతకు ముందు నాయకులతో కలిసి స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు.



చెత్త ఊడుస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన, మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ దస్తగిరి

వినుకొండ : సబ్‌జైలులో హిందు, ముస్లిం, క్రైస్తవ ఆలయాల నిర్మాణానికి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తెలిపారు. ఖైదీల సంక్షేమ దినోత్సవం సందర్భంగా బుధవారం సబ్‌జైలులో ఆయన మాట్లాడుతూ రాత్రివేళ ఇబ్బంది పడకుండా ఇన్వర్టర్ ఇస్తానని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు వాటర్ ఫిల్టర్ అందజేస్తారని చెప్పారు.

మహాత్మా.. జాతి మరువదు నీ చరిత



బొప్పూడిలో హెచ్‌ఎం విద్యార్థులు, ఉపాధ్యాయులు



యడ్లపాడు : పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై బాలకృష్ణ



తెదేపా జిల్లా కార్యాలయంలో..



ఈపూరు కూడలిలో..



వినుకొండ : విగ్రహానికి పూలమాల వేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

ఘనంగా జాతిపిత జయంతి

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యాలయాలలో బుధవారం జాతిపిత మహాత్మాగాంధీ జయంతి ఘనంగా నిర్వహించారు. బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

-న్యూస్‌టుడే, బృందం



కొనకంచివారిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో..



నూజండ్ల మండల పరిషత్ కార్యాలయంలో..



వినుకొండ పట్టణ పోలీస్ స్టేషన్‌లో..



నరసరావుపేట : జనసేన పార్టీ కార్యాలయంలో..



రొంపిచర్లలో సర్పంచి జయమ్మ తదితరులు

గ్రామాల్లో ప్లాస్టిక్ నిషేధించాలి

వినుకొండ రూరల్ : ప్లాస్టిక్ సంచులకు బదులుగా జూట్, వస్త్ర సంచులు వాడి ఆదర్శ గ్రామాలుగా గుర్తింపు పొందాలని ఈవోపీఆర్డీ సుందరరెడ్డి పిలుపునిచ్చారు. గాంధీ జయంతి సందర్భంగా నరగాయపాలెం, బ్రాహ్మణపల్లి, చాట్రగడ్డపాడులో గ్రామసభల్లో ఆయన పాల్గొన్నారు. కుటుంబాన్ని, రాష్ట్రాన్ని, దేశాన్ని ప్లాస్టిక్ భూతం నుంచి రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని చెప్పారు. సఫాయి మిత్రలను సన్మానించి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.



సఫాయి మిత్రలను సన్మానిస్తున్న అధికారులు

రాష్ట్రస్థాయి పోటీలకు రొంపిచర్ల విద్యార్థి ఎంపిక

రొంపిచర్ల, న్యూస్‌టుడే : రొంపిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బి.శ్రీలక్ష్మి ఖో-ఖో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ బీ.ఎం.సుభాని బుధవారం తెలిపారు. కారంపూడిలోని బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉమ్మడి గుంటూరు జిల్లాస్థాయి అండర్- 14 బాలికల విభాగంలో ఖో-ఖో పోటీలు నిర్వహించారు. వీటిలో ప్రతిభ చూపిన బి.శ్రీలక్ష్మి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జట్టు తరపున ప్రాతినిధ్యం వహించనుంది. విద్యార్థిని, పీడీ సైదయ్యను హెచ్‌ఎం, ఎస్‌ఎంసీ ఛైర్మన్ కొండలు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.



బి.శ్రీలక్ష్మి

తైక్వాండో పోటీలకు శంకరభారతీపురం విద్యార్థులు..

నరసరావుపేట క్రీడలు : ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తెనాలి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్‌లో నరసరావుపేటకు చెందిన ముగ్గురు క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు బుధవారం శిక్షకుడు రవిశంకర్ తెలిపారు. శంకరభారతీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ముప్పాళ్ల శివసాయి శ్రీకర్ అండర్- 17 విభాగంలో బంగారు పతకం, తాళ్లూరి జాన్‌పాల్, గెండెపోగు దేవరాజు అండర్- 14 విభాగంలో బంగారు పతకం సాధించినట్లు చెప్పారు. వీరు 6, 7, 8 తేదీల్లో తిరుపతిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి గుంటూరు జిల్లా తరపున ఆడనున్నట్లు తెలిపారు. శిక్షకుడు రవిశంకర్‌ను, విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.



పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

రైతుసేవా కేంద్రాల్లో ఎరువులు

నూజండ్ల : రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులను పంపిణీ చేస్తున్నట్లు సర్పంచి దాసరి రవీంద్ర అన్నారు. అప్పాపురం రైతు సేవా కేంద్రంలో బుధవారం పంపిణీ చేపట్టారు. రైతుల వద్దకే సంక్షేమ పాలన అందించాలన్నది ప్రభుత్వ సంకల్పంగా ఆయన పేర్కొన్నారు. డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులను రైతులకు అందజేశారు. వ్యవసాయ సహాయకుడు అశోక్, మాజీ సర్పంచి నక్కా బుల్లీశ్వరరెడ్డి, నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎరువులు పంపిణీ చేస్తున్న సర్పంచి, అధికారులు

నేటి నుంచి దేవీ శరన్నవ రాత్రోత్సవాలు

నూజండ్ల, న్యూస్‌టుడే : మండలంలోని రవ్వారం శ్రీ వేంకటేశ్వర జగన్మాత పీఠంలో గురువారం నుంచి అక్టోబరు 12 వరకు దేవీ శరన్నవ రాత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పీఠం నిర్వాహకుడు దుర్గేశ్వరరావు పేర్కొన్నారు. అమ్మవారికి కుంకుమార్చనలు, హోమాలు చేయనున్నట్లు తెలిపారు.



అమ్మవారు

శయన అలంకరణలో అమ్మవారు



చిలకలూరిపేట పట్టణం : స్థానిక చిలకలూరిపేట ఎన్ఆర్‌టీ కూడలి వద్ద ఉన్న శారదాంబ దేవాలయంలో బుధవారం అమ్మవారు శయన అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. దేవాలయంలో ఒక రోజు ముందుగానే దసరా శరన్నవ రాత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి.

← అలంకరణలో అమ్మవారు

ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణానికి ముప్పు

నూజండ్ల, న్యూస్‌టుడే : ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికి, ప్రజల ప్రాణాలకు ముప్పని ఐటీసీ, సెర్ప్ జిల్లా సమన్వయకర్త శ్రీనివాసరావు అన్నారు. బుధవారం జంగాలపల్లెలో సంస్థల ప్రతినిధులు, సిబ్బంది సచివాలయ, పంచాయతీ సిబ్బందితో కలిసి గ్రామంలో ప్రదర్శన చేశారు. రోడ్డు పక్కన ఉన్న ప్లాస్టిక్ తొలగించారు. మురుగు కాలువల్లో చెత్తాచెదారం తొలగించి మెట్ట తామర మొక్కలు నాటారు. స్వచ్ఛ భారత్ మండల సమన్వయకర్త కంచర్ల సుబ్బరామయ్య, కార్యదర్శి వెంకటేశ్వర్లు, రమేష్, ఐటీసీ ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో ఐటీసీ అధికారులు, సిబ్బంది, గ్రామస్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట) : నరసరావుపేట లూథరన్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యనభ్యసించిన 1983 బ్యాచ్ బుధవారం పేరల్స్ కల్యాణ మండపంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించింది. ఈ సందర్భంగా వారంతా ఆత్మీయంగా పలకరించుకుని ఆప్యాయత చాటారు.

విశాఖ ఉక్కును బలోపేతం చేయాలి

నరసరావుపేట అర్బన్ : కేంద్రం విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకుని బలోపేతం చేయాలని వక్తలు డిమాండ్ చేశారు. వామపక్ష యువజన, కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో బుధవారం విశాఖ ఉక్కు పరిరక్షణ దీక్షలు కొనసాగాయి. గాంధీ పార్కు వద్ద శిబిరంలో ఏఐటీయూసీ, సీఐటీయూ నేతలు దీక్షలు చేశారు.

పట్టణంలో కుండపోత వర్షం

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట) : పట్టణంలో బుధవారం రాత్రి కుండపోత వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన గాలులు రాగా కొద్దిసేపు విద్యుత్తు అంతరాయం ఏర్పడింది. చర్యలు చేపట్టి పునరుద్ధరిస్తామని అధికారులు తెలిపారు.

వైద్య శిబిరానికి స్పందన

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : కొండవీడు ఈఎన్‌టీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కేజే మోహన్‌రెడ్డి, శ్రీవర్షిణి 225 మందికి గొంతు, చెవి, ముక్కు, సంబంధిత వ్యాధులకు పరీక్షలు చేశారు. రూ.1.85 లక్షల విలువైన మందులు పంపిణీ చేశారు.

యువకుల రక్తదానం

చిలకలూరిపేట పట్టణం : మహాత్మాగాంధీ జయంతి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాతృమూర్తి ప్రత్తిపాటి చిన నారాయణమ్మ జ్ఞాపకార్థం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బుధవారం కల్యాణ మండప సంఘం, వాసవి యువ దళం, క్రేజీ గైస్, శ్రీ బాల గణపతి యూత్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఛైర్మన్ ఎస్‌కే రఫాని, తెదేపా నాయకులు కరిముల్లా, చేవూరి కృష్ణమూర్తి, కనమర్లపూడి రమేష్ పాల్గొన్నారు.

సమస్య పరిష్కారం

వినుకొండ : పట్టణంలోని సత్రం బజారులో రెండేళ్లుగా కాల్వపైన అక్రమ నిర్మాణం వల్ల మురుగు ముందుకు సాగక దారిలో నిలిచేది. రాకపోకలకు ఇబ్బందిగా ఉందని ప్రజలు మొత్తుకున్నా ఎవరూ పట్టించుకోలేదు. సమస్యపై 'ఈనాడు'లో చిత్ర కథనం ప్రచురితం కాగా నూతన మున్సిపల్ కమిషనర్ సభాష్ చంద్రబోస్ దృష్టి పెట్టి కాలువ బాగు చేయించడంతో పాటు నడకదారి సిమెంట్‌తో నిర్మించే చర్యలు చేపట్టారు. ఇపుడు ఇబ్బందులు తొలగాయని స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

సత్తెనపల్లి

•సత్తెనపల్లి •పెదకూరపాడు •మాచర్ల •గురజాల

నృసింహుని ఆలయంలో మహాశాంతి హోమం


స్వామికి పూజలు చేస్తున్న పూజారులు

దాచేపల్లి, న్యూస్‌టుడే: తెలుగు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతం.. కృష్ణానది ఒడ్డున మట్టపల్లిలోని శ్రీలక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు జరుగుతున్నాయి. బుధవారం స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మహాశాంతి హోమం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. దేవస్థాన అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత.. సామాజిక బాధ్యత


శ్రమదానం చేస్తున్న విద్యార్థులు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: స్వచ్ఛత.. సామాజిక బాధ్యత అని, పరిసరాల శుభ్రతలో యువత కీలక భూమిక పోషించాలని స్థానిక ఎస్‌బీజీ డిగ్రీ కళాశాల డైరెక్టర్ మట్టా సుబ్రమణ్యం అన్నారు. నెహ్రూ యువకేంద్ర, గుంటూరు పేస్ సొసైటీ, ఎస్‌బీజీ ఎన్ఎస్ఎస్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం స్వచ్ఛతా హీ సేవ-2024 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రమదానంతో కళాశాల పరిసరాలను శుభ్రం చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
మాచర్ల గ్రామీణ: 80085 73181 గురజాల: 80085 7 3176

? వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రుల్లో బయటకు రావాలంటే ఇబ్బందులు పడుతున్నాం. **- కొండలు, ఎస్టీ కాలనీ, ఆకులగణపవరం**

✔ ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌తో మరమ్మతులు నిర్వహించి సమస్య పరిష్కరిస్తాం. **- మహంకాళమ్మ, కార్యదర్శి, -** న్యూస్‌టుడే, రాజుపాలెం

? సత్తెనపల్లి నుంచి నరసరావుపేట వెళ్లే ఆర్‌అండ్‌బీ మార్గంలో దమ్ము ట్రాక్టర్లు రోడ్డును ఛిద్రం చేస్తున్నాయి. **- శివశంకరప్రసాద్, స్థానికుడు**

✔ రహదారులపై దమ్ము ట్రాక్టర్లు తిప్పుతున్న వారిపై చర్యలు తీసుకుంటాం. **- కృష్ణారెడ్డి, ఆర్‌అండ్‌బీ డీఈ, -** న్యూస్‌టుడే, సత్తెనపల్లి

? చల్లగుండ్ల ఆర్వో ప్లాంటు వద్ద విద్యుత్తు తీగలకు చెట్టు కొమ్మలు తాకడంతో మంటలు ఎగిసిపడుతున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నాం. **- హనుమంతురావు, చల్లగుండ్ల**

✔ విద్యుత్తు తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగిస్తాం. **- దానియేలు, విద్యుత్తుశాఖ అధికారి, -** న్యూస్‌టుడే, నకరికల్లు

కంటి వైద్య శిబిరం

ముప్పాళ్ల, న్యూస్‌టుడే: చాగంటివారిపాలెంలో నవయువతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. గాంధీ జయంతి వేడుకల్ని నిర్వహించారు.

అద్దె భవనాల్లో ఇంకెన్నాళ్లు?

గ్రామీణ వైద్యసేవలకు గ్రహణం

సత్తెనపల్లి గ్రామీణ, పెదకూరపాడు, క్రోసూరు (అచ్చంపేట), న్యూస్‌టుడే

పల్లెవాసులకు స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కొన్నేళ్ల కిందట ఆరోగ్య ఉపకేంద్రాలు ఏర్పాటయ్యాయి. గత ప్రభుత్వంలో గ్రామ సచివాలయానికి ఒకటి వంతున ఆయుష్మాన్ భారత్ హెల్త్, వెల్‌నెస్ సెంటరు నిర్మించి బహుళ సేవలు అందించనున్నట్లు పాలకులు బీరాలు పలికారు. ఐదేళ్ల పాలన ముగిసే నాటికి క్షేత్రస్థాయిలో అనేకచోట్ల కేంద్రాల నిర్మాణానికి స్థల సేకరణ జరగలేదు. కొన్ని నిర్మాణ పనులు పునాదుల దశలో నిలిచాయి. మరికొన్ని చోట్ల ఊరికి వెలుపల కట్టడంతో ప్రారంభానికి నోచుకోలేదు. అనేక గ్రామాల్లో నేటికీ ఇరుకైన అద్దె భవనాల్లో, పంచాయతీ భవనాల్లో ఆరోగ్య సిబ్బంది సేవలందిస్తున్నారు. నిర్ణీత తేదీల్లో గ్రామాల్లో వైద్య సేవలందించే '104' డాక్టరు, సిబ్బందికి జాగాలేక శిథిల భవనాల్లో, కూడళ్లలో రోగులను పరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో ఉపకేంద్రాల నిర్మాణం జరిగి ఆరోగ్య సేవలకు ఆటంకాలు తొలగుతాయని గ్రామీణులు ఆశిస్తున్నారు.


గుడిపూడిలో పూర్తయినా ప్రారంభానికి నోచని ఆరోగ్య కేంద్ర భవనం

సేవలు ఇలా..: గ్రామీణ ఆరోగ్య ఉపకేంద్రాల్లో రక్తపోటు, మధుమేహం పరీక్షలు, గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్నారులకు మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్(ఎంఎల్‌హెచ్‌పి)లు వైద్య సేవలందిస్తారు. ఆరోగ్య అవగాహన కల్పించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేస్తారు. నిర్ణీత తేదీల్లో వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ఆరోగ్య సిబ్బంది చేపడతారు. గ్రామీణుల ఆరోగ్య సేవల్లో ప్రాధాన్యత సంతరించుకున్న కేంద్రాలకు అనేక పల్లెల్లో శాశ్వత భవనాలు లేవు. ఔషధాలు, దస్త్రాలు, ఫర్నీచర్ ఉంచడానికి సేవలందించడానికి సిబ్బందికి, రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లోని గ్రామాల్లో ఆరోగ్య ఉపకేంద్రాల పరిస్థితి గమనిస్తే ఈ విషయం స్పష్టం అవుతోంది.

పరిస్థితి ఇదీ..

★ సత్తెనపల్లి మండలం కంకణాలపల్లిలో అద్దె భవనం, పెదమక్కెనలో ఇరుకు, శిథిల భవనం, కొమెరపూడిలో పంచాయతీ కార్యాలయం, అబ్బూరులో గ్రామ పంచాయతీ పైఅంతస్తులో ఆరోగ్య సిబ్బంది సేవలందిస్తున్నారు. అబ్బూరులో వృద్ధులు మెట్లపై రాకపోకలు సాగించేందుకు అగచాట్లు పడుతున్నారు. ఆరువేల పైచిలుకు జనాభా ఉన్న నందిగామలో చిన్న గదిలో మొన్నటి వరకు కేంద్రాన్ని నిర్వహించారు. ఇటీవల గ్రామ పంచాయతీ భవనంలోకి మార్చారు. కందులవారిపాలెం, భట్లూరులో నిర్మాణాలు చేపట్టలేదు. గుడిపూడి, అబ్బూరులో నిర్మాణాలు పూర్తయినా ప్రారంభించలేదు. గుడిపూడిలో అబ్బూరు డొంకలో నిర్మించడంతో గ్రామస్థులకు దూరంగా ఉందనే వాదన వినవస్తోంది.

★ అచ్చంపేటలో ఆరుచోట్ల సొంత భవనాలు ఉన్నాయి. తాడువాయిలో పాలకేంద్రంలోని ఓ గదిలో సిబ్బంది సర్దుకుపోతున్నారు. పెదపాలెం, కొండూరు, కస్తల, కోనూరు, ఓర్వకల్లు, చిగురుపాడు, గ్రంథ సిరిలో అద్దె, ఇతర ప్రభుత్వ శాఖల భవంతుల్లో సేవలు జరుగుతున్నాయి.

★ క్రోసూరు మండలం ఆవులవారిపాలెం, హసానాబాద్, అందుకూరు, నాగవరం గ్రామాల్లో కేంద్రాలకు శాశ్వత భవనాలు లేవు.

★ పెదకూరపాడు మండలం పాటిబండ్ల, కంభంపాడు, కాశిపాడుల్లో సొంత భవంతులు లేక ఇతర జాగాలను ఆశ్రయిస్తున్నారు.

స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దాలి


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఎల్‌డీవో గఫ్రునాయక్

గురజాల గ్రామీణ : స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలని డీఎల్‌డీవో గఫ్రునాయక్ తెలిపారు. బుధవారం పల్లెగుంత గ్రామంలో స్వచ్ఛ భారత్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పల్లెలను స్వచ్ఛంగా తీర్చిదిద్దాలంటే ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం చెత్త కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఫణికుమార్ నాయక్, సర్పంచి స్వరాజ్యలక్ష్మి, జాస్తి ప్రకాష్, కార్యదర్శి గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముడి బాటలో నడుద్దాం


పెదకూరపాడులో గాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రి చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్


బెల్లంకొండలో ఆర్యవైశ్య సంఘం నాయకులు


మాచవరంలో..


మాచర్లలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి


పిడుగురాళ్ల: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

జాతిపిత మహాత్మాగాంధీ జయంతి వేడుకల్ని బుధవారం ఊరూరా నిర్వహించారు. గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు అధికారులు, ఉద్యోగులు, రాజకీయ పార్టీల నాయకులు, ఆర్యవైశ్య సంఘాల నాయకులు, సేవాసంస్థల బాధ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహాత్ముడి బాటలో దేశ, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి ఐక్యంగా కృషి చేద్దామని వక్తలు పిలుపునిచ్చారు. - న్యూస్‌టుడే, బృందం


గురజాలలో..


సత్తెనపల్లిలో కూటమి పార్టీల నాయకుల నివాళి


దాచేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో


అచ్చంపేటలో..

నేటి నుంచి నవరాత్రుల మహోత్సవాలు

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి, శ్రీకనకదుర్గమ్మ, శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి, గంగమ్మ, భోళాలింగేశ్వరస్వామి, గుత్తికొండ బిలంలోని రాజరాజేశ్వరి ఆలయాల్లో దేవి నవరాత్రుల మహోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమవుతాయని ఆయా ఆలయాల కమిటీ అధ్యక్షులు తెలిపారు. వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రతిరోజు ఉదయం 9 గంటలకు కుంకుమార్చన జరుగుతుందన్నారు. నాగులగుడిలో ప్రతిరోజు చండీ యాగం చేయనున్నట్లు చెప్పారు.

అమరేశ్వరాలయంలో..

అమరావతి, న్యూస్‌టుడే: దసరా సందర్భంగా అమరేశ్వరాలయంలో ఈనెల 3 నుంచి 12 వరకు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. తొమ్మిది రోజులపాటు బాలచాముండేశ్వరి అమ్మవారిని విశేషంగా అలంకరించనున్నట్లు ఈవో వేమూరి గోపి తెలిపారు. 3న రజత కవచాలంకృత, 4న బాలత్రిపుర సుందరీదేవి, 5న గాయత్రీ దేవి, 6న అన్నపూర్ణాదేవి, 7న లలితా త్రిపురసుందరీదేవి, 8న శ్రీమహాలక్ష్మీదేవి, 9న సరస్వతీ దేవి, 10న దుర్గాదేవి, 11న మహిషాసురమర్దని, 12న రాజేశ్వరీదేవి అలంకారాల్లో అమ్మవారు దర్శనమివ్వనున్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికలను ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ బుధవారం ఆవిష్కరించారు.

వీఆర్వో ఆచూకీకి గాలింపు

ముప్పాళ్ల: నార్నెపాడు వీఆర్వో సత్తెనపల్లి మల్లికార్జునరావు ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు ఎస్సై సోమేశ్వరరావు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు, ఇష్టంలేని పెళ్లి చేశారనే కారణాలతోనే అదృశ్యమైనట్లు ప్రాథమికంగా తేలిందని ఆయన చెప్పారు.

రేషన్ దుకాణాల తనిఖీ

గురజాల గ్రామీణ: లబ్ధిదారులకు సకాలంలో రేషన్ బియ్యం, ఇతర సరకులను పంపిణీ చేయాలని తహసీల్దారు నగేష్ తెలిపారు. గురజాల, కొత్తఅంబాపురం గ్రామాల్లో రేషన్ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. తూకాల్లో తేడా వస్తే చర్యలు తప్పవన్నారు.

4 నుంచి చెన్నైకి బస్సు

మాచర్ల (కారంపూడి): ఈనెల 4 నుంచి మాచర్ల నుంచి చెన్నైకి బస్సు సర్వీసు ప్రారంభిస్తున్నట్లు డిపో మేనేజర్ పిచ్చయ్య తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం 5కు మాచర్లలో బయలుదేరి వినుకొండ, ఒంగోలు, నెల్లూరు మీదుగా మరుసటి రోజు ఉదయం 6.30కు చేరుతుందన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి దాతల సహకారం

రెంటచింతల, న్యూస్‌టుడే: గాంధీ జయంతి సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పలువురు దాతలు సామగ్రిని అందజేశారు. మండల ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు ఏచూరి వెంకట సైదయ్య సతీమణి అడ్వకేట్ లక్ష్మి ఆధ్వర్యంలో దుప్పట్లు, దిండ్లు అందించారు. అలాగే వాటర్ ఫిల్టర్‌ను అమర నాగేశ్వరరావు కుమారుడు గౌరు శివపుల్లారావు అందించారు. సాగరమాత కేటరింగ్ యాజమాన్యం సత్యనారాయణరెడ్డి కుమారులు నరేంద్రరెడ్డి, రాజశేఖరరెడ్డి, ఓబుల్‌రెడ్డి 70 కుర్చీలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అందించారు.

ప్రైవేటు వైద్యశాలలపై చర్యలు

దుర్గి, న్యూస్‌టుడే: దుర్గిలో పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న రెండు ప్రైవేట్ వైద్యశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో డాక్టర్ రవి అన్నారు. బుధవారం ఆయన దుర్గిలోని పీపుల్స్ నర్సింగ్‌హోం, డాక్టర్ కేర్ ఆసుపత్రులను తనిఖీ చేసేందుకు వచ్చారు. ఆ సమయంలో రెండు ఆసుపత్రులకు తాళాలు వేసి ఉండటంతో ఆయన ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి వచ్చి అక్కడి రికార్డులను పరిశీలించారు. రెండు ఆసుపత్రుల్లో సేవలను గురువారం నుంచి నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని ఆరోగ్య కేంద్రం వైద్యుడు పెద సైదులును ఆదేశించారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

సత్తెనపల్లి: ప్రభుత్వ నూతన మద్యం పాలసీ-2024 నిబంధనలకు అనుగుణంగా నియోజకవర్గంలో మద్యం దుకాణాల నిర్వహణకు ఔత్సాహికులైన ప్రైవేట్ వ్యక్తుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అబ్కారీశాఖ సీఐ విజయ్‌కుమార్ చెప్పారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 9 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు.

మాచర్ల (కారంపూడి): మాచర్ల ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ వెంకటరమణ కోరారు. సర్కిల్ పరిధిలో 10 దుకాణాలు మంజూరయ్యాయన్నారు.

పవన్ కల్యాణ్ దీక్షకు మద్దతు


నగర సంకీర్తనలో జనసేన నాయకులు, కార్యకర్తలు, భక్తులు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా జనసేన పార్టీ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో నమో నారాయణ అంటూ నగర సంకీర్తన నిర్వహించారు. గీతామందిరం నుంచి ప్రదర్శనగా బయలుదేరి పలు ఆలయాల్లో పూజలు చేశారు. జనసేన పార్టీ నియోజకవర్గ నాయకుడు బొర్రా వెంకటఅప్పారావు, నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

నాగోలు: గంజాయి విక్రయిస్తున్న దంపతులను ఎల్బీనగర్ పోలీసులు అరెస్టు చేశారు. దుర్గి మండలం మూటుకూరు గ్రామానికి చెందిన యాపర్తి గోపి, ఉమామహేశ్వరి దంపతులు మాచర్లకు చెందిన చల్లా శివనాగరాజు వద్ద గంజాయిని తక్కువ ధరకు కొని హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు దంపతులను అరెస్టు చేశారు.

భారీ వర్షం.. కూలిన చెట్లు

ముప్పాళ్ల: ఈదురు గాలులతో కూడిన భారీ వర్షానికి సత్తెనపల్లి- నరసరావుపేట ప్రధాన రహదారిపై ఇరుకుపాలెం మదర్‌సా వద్ద బుధవారం రాత్రి చెట్లు నేలకూలాయి. సమాచారం అందుకున్న ఎస్సై సోమేశ్వరరావు వెంటనే అక్కడకు చేరుకుని జేసీబీతో చెట్లు, కొమ్మలను తొలగింపజేసి రాకపోకలు సాగేలా చర్యలు తీసుకున్నారు.

ఎండకు అల్లాడిన భక్తులు


ఘాట్‌లో భక్తులు

అమరావతి : మహాలయ అమావాస్య సందర్భంగా అమరేశ్వర ఘాట్‌లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఏటా మహాలయ అమావాస్య రోజున పిత్ర దేవతలకు పిండ ప్రదానం చేయడానికి ఇక్కడికి పెద్ద సంఖ్యలో తరలివస్తారు. అయితే ఆలయ అధికారులు కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పిండ ప్రదానం ఘాట్‌లో ఎండకు అల్లాడిపోయారు. ఘాట్‌లో కూర్చోలేక.. నిల్చోలేక అవస్థలు పడ్డారు. కనీం షామియానాలు ఏర్పాటు చేయాలని ఆగ్రహం వ్యక్తం చేశారు.

'బీమా ప్రీమియంపై జీఎస్టీ రద్దు చేయాలి'


సత్తెనపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే: బీమా పాలసీదారులకు అధిక మొత్తంలో రాయితీనిచ్చి ప్రీమియంపై జీఎస్టీ రద్దు చేయాలని జీవిత బీమా ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (లియాఫి) సత్తెనపల్లి సంఘం అధ్యక్షుడు మంచాల రమేష్ డిమాండు చేశారు. సత్తెనపల్లి జీవిత బీమాసంస్థ కార్యాలయంలో లియాఫి ఆవిర్భావ దినోత్సవం బుధవారం నిర్వహించారు. మహాత్మాగాంధీ, లియాఫి దివంగత నాయకుడు పి.కృష్ణప్రసాద్ చిత్రపటాలకు సంఘం ప్రతినిధులు నివాళి అర్పించారు. ఇటీవల వరద బాధితుల సహాయార్థం విరాళాలు అందించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

సెలవులకు ఊరెళ్తున్నారా..
ఇల్లు జరభద్రం!

తాళం వేసిన గృహాలే లక్ష్యంగా చోరీలు ★ అందుబాటులో సాంకేతిక సేవలు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే

దసరా సెలవులు వచ్చేశాయి.. విహార యాత్రలు, సొంతూళ్లు, బంధువుల ఇళ్లకు వెళ్లేందుకు సన్నద్ధమవుతున్నారా..? అయితే జర జాగ్రత్త.. ఇదే అదనుగా దొంగలు కూడా మాటువేసి ఉన్నారు. తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్నారు. గతంలో దసరా పండగకు పలు ఇళ్లల్లో చోరీలు జరిగిన ఘటనలు ఉన్నాయి. నగదు, విలువైన బంగారం, వెండి వస్తువులు మాయమయ్యాయి. ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడంతో కొందరు తీవ్రంగా నష్టపోయారు. సత్తెనపల్లిలో రూ.20 లక్షలు విలువచేసే బంగారం, నగదును దొంగలు రెండిళ్లల్లో దోచుకెళ్లారు. అలాంటి పరిస్థితి రాకుండా ఉండాలంటే అప్రమత్తత ఎంతో అవసరం.


ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్

ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ అండగా..

లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్) యాప్.. సాంకేతిక పరిజ్ఞానంతో ఇళ్లల్లో దొంగతనాల్ని అడ్డుకునేందుకు ఉద్దేశించిన వ్యవస్థ. గత తెదేపా ప్రభుత్వ హయాంలో రాష్ట్ర పోలీసుశాఖ దీన్ని అందుబాటులోకి తెచ్చింది. అన్ని పట్టణాల్లో అమలు చేస్తున్నారు. ఇంటిని విడిచి కొన్ని రోజులపాటు దూరంగా ఉండేవారు స్థానిక పోలీసు స్టేషన్‌లో సంప్రదిస్తే వారు ఆ ఇంట్లో సీసీ కెమెరాలను ఏర్పాటుచేసి దాంతో ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను అనుసంధానం చేస్తారు. తాళంవేసి ఉన్న ఇంటి తలుపులు ఎవరైనా తీసినా.. చోరీకి అవకాశమున్నా వెంటనే ఆ యాప్ పోలీసులను అప్రమత్తం చేసి క్షణాల్లో వారు అక్కడికి చేరేలా చేస్తుంది. ఈ యాప్‌ను సెలవుల్లో ఎక్కువమంది వినియోగించుకోవడం ద్వారా ఇంటిని భద్రంగా ఉంచుకోవచ్చు. ప్రస్తుతం సీసీ కెమెరాలు అందరికీ అందుబాటులో ధరల్లో లభిస్తున్నాయి. వాటిని ఇంట్లో ఏర్పాటు చేసుకుని పోలీసుశాఖ నిఘా వ్యవస్థతో అనుసంధానం చేసుకోవడం ద్వారా ఇంటిని విడిచి వెళ్లే సమయంలో రక్షణగా వినియోగించుకోవచ్చు.

వీటిని మరువద్దు

★ ఇళ్లలో దొంగతనాలు జరగకుండా ఉండాలంటే పోలీసులు కొన్ని సూచనలు చేస్తున్నారు. ★ సాంకేతిక పరిజ్ఞానంతో ఇంటి చుట్టూ నిఘా ఉంచుకోవాలి. ★ ఊరెళ్తున్నట్లు గస్తీ పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ★ ఇరుగు పొరుగుకు సమాచారమిచ్చి తమ ఇంటిపై ఓ కన్నేసి ఉంచమని చెప్పాలి. ★ ఇంటికి తాళం కనిపించకుండా కర్టెన్ అడ్డు వేయాలి. ★ ఇంట్లో ఎల్లప్పుడు బల్బు వెలిగి ఉండేలా చూసుకోవాలి.

తురకపాలెంలో పోలీసు పికెట్



మాచవరం, న్యూస్‌టుడే: మండలంలోని తురకపాలెంలో తెదేపా, వైకాపా వర్గీయుల ఘర్షణ నేపథ్యంలో పోలీసులు గ్రామంలో పికెట్ ఏర్పాటు చేశారు. పోలీస్ సిబ్బందితోపాటు ప్రత్యేక బలగాలు పహారా కాస్తున్నాయి. ఎటువంటి గొడవలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు.

తెదేపా సభ్యత్వ నమోదుకు కృషి

పెదకూరపాడు : రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు డిగ్రీ చదివిన ప్రతి ఒక్కరూ ఓట్లు నమోదు చేసుకునేలా నాయకులు చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో తెదేపా సభ్యత్వ నమోదుకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి, సభ్యత్వ నమోదుకు కృషి చేయాలని సూచించారు.

30 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: తుమ్మలచెరువులో 30 బస్తాల రేషన్ బియ్యాన్ని మంగళవారం అర్ధరాత్రి పట్టుకున్నట్లు ఎస్సై మోహన్ తెలిపారు. దాచేపల్లి పట్టణానికి చెందిన వ్యాపారి కొప్పుల వెంకటేశ్వర్లు తుమ్మలచెరువులో వీర్లదేవి దగ్గర 30 బస్తాల బియ్యాన్ని కొనుగోలు చేశాడు. అర్ధరాత్రి బొలేరో వాహనంలో తరలిస్తుండగా పట్టణ పోలీసులు పట్టుకున్నారు. బియ్యం, వాహనాన్ని పోలీసుస్టేషన్‌కు తరలించారు. వ్యాపారితోపాటు వీర్లదేవిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.